www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 27 అక్టోబర్ 2025



కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై 59 కేసులు నమోదు
- జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్

ప్రజాశక్తి-రాయచోటి

రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో గత రెండు రోజులుగా కాంట్రాక్ట్ క్యారేజి బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడిందని, ఈ సందర్భంగా మొత్తం 59 కేసులు నమోదు చేసి సుమారు రూ.1,54,100లు జరిమానా విధించినట్లు జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. నమోదైన కేసుల వివరాలు అగ్ని మాపక పరికరం లేకపోవడం, ప్రథమ చికిత్స పెట్టె లేకపోవడం, ప్రయాణికుల జాబితా నిర్వహించకపోవడం, అధిక చార్జీలు వసూలు చేయడం, ఎక్కువ వెలుతురుతో లైట్లు ఉపయోగించడం, అనుమతి పత్రం (పర్మిట్) లేకపోవడం మొదలైన కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఉల్లంఘనలు అరికట్టేందుకు ఈ డ్రైవ్ మరికొన్ని రోజులు కొనసాగుతుందని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికులకు 12వ పిఆర్‌సిని ప్రకటించాలి

మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ్రాజ్యం

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

మున్సిపల్ కార్మికులకు 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ్రాజ్యం కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రీతం రెసిడెన్సీలో మున్సిపల్ ప్రథమ జిల్లా మహాసభ నిర్వహించారు. కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి బస్టాండు, హరినాథవీధి, గాలివీడురోడ్డు మీదుగా ప్రీతం కల్యాణ మండపం వరకు డప్పు వాయిద్యాలతో, నృత్యాలతో, నినాదాలతో జిల్లా అధ్యక్షులు బివి రమణ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సామ్రాజ్యం జెండా ఆవిష్కరించారు. చనిపోయిన కార్మికులకు సంతాపం తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజల అపరిశుభ్రతను శుభ్రం చేస్తూ మున్సిపల్ కార్మికులు అనేక వ్యాధులకు గురైనప్పటికీ పాలకులు పట్టించుకోక పోగా కనీస వేతనం, పిఆర్‌సి ఇవ్వకపోవడం దారుణం అన్నారు. పాలకులు కార్మికుల పనిగంటలను పెంచుతూ, ఉద్యోగ భద్రత లేకుండా పెట్టిచాకిరి చేయించడం దుర్మార్గం అంటూ ఆమె మండిపడ్డారు. నవంబరులో నిర్వహించే రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలంటూ కోరారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎ.వి. రమణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, మున్సిపల్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి రమణ, శంకరయ్య మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చిన సమ్మెకాలపు హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక కుటుంబాలకు సంక్షేమ పథకాల అమలు చేయాలని, మరణించిన, ఉద్యోగ విరమణ చేసిన వకార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యు లకే ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కోవిడ్ కాలపు కార్మికులకు కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని, డ్రైవర్లకు రూ. 24,500 జీతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణాల విస్తరణ మేరకు కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. నవంబర్ 15న రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయచోటి, మదనపల్లి, బి.కొత్తకోట, రాజంపేట మున్సిపాలిటీ నుండి పెద్దఎత్తున మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ్రాజ్యం

యువతకు క్రీడలు అవసరం

జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జి.చంద్రశేఖర్

ముఖా ముఖి..



ప్రజాశక్తి- రాయచోటి

యువతీ, యువకులకు విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో క్రీడలతో యువత, యువకులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసు కుంటుంది. జిల్లాలో స్టేడియాలు, స్పోర్ట్స్ అధికారులు పని వివరాలు, ప్రస్తుతం క్రీడా పోటీలు ఎక్కడ జరుగుతున్నాయో, చేపడుతున్న క్రీడ అభివృద్ధికి తీసుకుంటున్న కార్యక్రమాలు ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో స్టేడియాల వివరాలు తెలియజేయండి?

అన్నమయ్య జిల్లాలో మూడు ప్రధాన స్టేడియాలు అందు బాటులో ఉన్నాయి. రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి మండలంలోని అబ్బవరం గ్రామం నక్కవాండ్ల పల్లె వద్ద 30ఎకరాలలో క్రికెట్ స్టేడియం జిల్లాలో ఉన్నాయి.

స్పోర్ట్స్ అధికారుల పని వివరాలు తెలపండి?

జిల్లాలో యువతీ యువకులకు అందు బాటులో ఉండి అన్ని రకాల క్రీడలకు సంబంధించి సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా టోర్నమెంట్ జరుగుతూ ఉంటే వాటిని పర్యవేక్షించడం, యువతీ, యువకులు క్రీడలు ఆడే వారిని గుర్తించడం వారిని రాష్ట్ర స్థాయిలో జరిగే కార్యక్రమాలకు పంపడం జరుగుతుంది.

జిల్లాలో ఎలాంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

ప్రస్తుతం జిల్లాలో క్రీడాల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నాం. సమ్మర్ కోచింగ్ క్యాంపులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. ఈ శిబిరాల్లో విద్యార్థులకు బహుళ క్రీడా విభాగాల్లో శిక్షణ కూడా ఉంటుంది.

క్రీడలకు ఎలాంటి సహకారం అందిస్తున్నారు?

ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ పాలసీ ప్రకారం స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్ఎఎ పి) స్పోర్ట్స్ క్యాలెండర్‌ను సిద్ధం చేస్తున్నాం. ఇది జిల్లా అధికారులతో సమన్వయంతో షెడ్యూల్ చేయబడుతుంది.

క్రీడా పోటీలు ఎక్కడ నిర్వహిస్తున్నారు?

సమ్మర్ కోచింగ్ ఇన్ క్యాంపుల్లోనూ, అలాగే స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ ఆదేశాలు ప్రకారంగా కొన్ని టోర్నమెంట్లు నిర్వహిస్తున్నాం.

ప్రభుత్వం ఏదైనా స్పోర్ట్స్ కిట్‌లను అందజేస్తోందా?

ప్రతి సంవత్సరమూ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ద్వారా జిల్లాలో సమ్మర్ కోచింగ్ నిర్వహించి వాటి ద్వారా క్రీడాకారులకు క్రీడా కిట్లను అందజేస్తున్నాం.

యువతకు క్రీడలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారా?

క్రీడల్లో మూడు పర్సెంట్ రిజర్వేషన్ కల్పించింది. దీని ద్వారా క్రీడాకారులందరికీ కూడా ప్రభుత్వ ఉద్యోగులలో అవకాశం కల్పిస్తున్నాం.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

అన్నమయ్య జిల్లాలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ (డిఎస్ఎ) కోచ్‌ల అవసరం ఉంది. ఆటగాళ్ల శారీరక శ్రేయస్సును కాపాడు కోవడానికి ఆరోగ్యం, ఫిట్‌నెస్ మార్గ దర్శకాలు జారీ చేశారు. శారీరక శిక్షణ, క్రీడలలో క్రమం తప్పకుండా పాల్గొనాలి. క్రమశిక్షణ, స్థిరత్వం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి.

ప్రయివేటీకరణను అడ్డుకునేందుకే కోటి సంతకాలు


మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను అడ్డుకు నేందుకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంబేపల్లి మండలం శెట్టిపల్లి గ్రామంలో రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 400 హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. వైసిపి చేసిన పోరాటాల వల్లనే అమ్మ ఒడి, ఆటో వాలాలకు ఆర్థిక సహాయం ను చంద్రబాబు ప్రభుత్వం చేయడం జరిగింద న్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్న ప్రతి ఇల్లు రెండు నుంచి మూడు పథకాల ద్వారా లబ్ధి పొందడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ఆరోపించారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ వ్యతిరేకిస్తూ సేకరిస్తున్న సంతకాలను వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్‌కు అందిస్తారని చెప్పారు.కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు శతవిధాల ప్రయత్నం చేస్తున్నదన్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్ ప్రయివేట్ ఆస్పత్రులకు చెల్లించాల్సిన రూ.2700కోట్ల బకా యిలు పెండింగ్‌లో పెట్టడం దారుణం అన్నారు. జగన్ 2.0లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత, విలువ ఉంటుందన్నారు. కార్యక్రమం లో డిసిఎంఎస్ మాజీ అధ్యక్షుడు ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి ఉపేంద్రరెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మండల నేతలు గొర్ల రమేష్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, కాలాడి ప్రభాకర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయచోటి (సంబేపల్లి) : ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, అర్ రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామంలో జరిగిన ప్రజలు, వైసిపి కార్యకర్తలు, నాయకులతో జరిగిన రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి గొర్ల ఉపేంద్రారెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్ రెడ్డి,మండల నాయకులు గొర్ల రమేష్ రెడ్డి లతో కలసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.ప్రజల పక్షాన వైసిపి ఎప్పుడూ నిలుస్తుందన్నారు. ప్రభుత్వ తీరును ప్రశ్నించేందుకు, ప్రజల నిబద్ధతను నిరూపించేందుకు, కోటి మంది సంతకాల రూపంలో అభిప్రాయాన్ని గవర్నర్‌కు వైఎస్ఆర్ సిపి అధినేత జగన్ ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజలే నిజమైన తీర్పరిగా నిలవాల న్నారు. అనంతరం రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందన్నారు. సమష్టి కృషితో వైసిపిని బలోపేతం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి శ్రీధర్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, నాయకులు వివి ప్రతాప్ రెడ్డి,వాసుదేవరెడ్డి, కాకులపల్లె రమణా రెడ్డి, వైఎస్ఆర్ సిపి నియోజక వర్గ లీగల్ సెల్ ప్రెసిడెంట్ రమేష్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది ఆర్ శ్రీనివాసులు రెడ్డి, సర్పంచులు వెంకట రమణనాయక్, రామచంద్ర, మాజీ ఎంపిటిసి శివయ్య పాల్గొన్నారు.

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి



సంఘీభావం తెలుపుతున్న గిరిజన ప్రజా సమాఖ్య నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. మదనపల్లె మున్సిపల్ టౌన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 80 ఏళ్ళు అవుతున్నా నేటికీ లక్షల మంది గిరిజనులకు కూడు, గూడు, నీడ లేక పరితపిస్తున్నారన్నారు. గిరిజన జాతీ అభివృద్ధికి ప్రతి ఏటా ప్రభుత్వాలు కేటాయించే కోట్లాది రూపాయల నిధులను దారి మళ్లించకుండా వినియోగించబడాలంటే చట్టసభలలో గిరిజనుల తరపున ప్రాతినిత్యం వహించే వ్యక్తి ఉండాలన్నారు. అందుకోసం సంఘటితంగా, ఐక్యమత్యంతో ఉద్య మించాలన్నారు. ఎస్టిలో ప్రధానంగా సుగాలి, చెంచు, ఎరుకల, యానాది నక్కల ఇలా అనేక జాతులు ఉన్నాయని అయితే వీరందరికీ సమాన ప్రాతినిధ్యం లేదన్నారు. ఎస్‌టి జాబితాలోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదన తీసుకురావటం బాధాకరమని, అభివృద్ధికి నోచుకోక ఇప్పటికీ దిక్కులేని స్థితిలో గిరిజన ప్రజానీకం జీవిస్తున్నారనే విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రహించాలన్నారు. 2026లో 175 నుంచి 225కు పెరగనున్న నియో జకవర్గాలలో మైదాన ప్రాంత గిరిజనులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాలలో ప్రాతినిత్యం లభించేలా పోరాడాల్సిన సమయం ఆసన్న మైందన్నారు. జాతి భవిష్యత్తు, అభ్యున్నతి, వెలుగు కోసం, ఉద్యమ బాట మొ దలుపెట్టి ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని ప్రతి గిరిజన ప్రాంతాల్లో చేరేలా ప్రతి గిరిజనుడు కృషి చేయాలన్నారు.అనంతరం రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో విశ్వనాథ్ నాయక్, మునీంద్ర నాయక్, మూడే ప్రసాద నాయక్, లక్ష్మ నాయక్, చిన్న రాయుడు, మునిస్వామి, నరసింహ నాయక్, మంగు నాయక్, సురేంద్ర నాయక్ హనుమంతు నాయక్, భాస్కర్ నాయక్, ఎరుకుల రామాంజి పాల్గొన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఎస్‌పి ధీరజ్ ఆదేశాల మేరకు ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని డైట్ కళాశాలలో పోలీసులకు వారి పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు పిల్లల కోసం 'మహిళలను లైంగిక దాడుల నుంచి రక్షించడంలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై పోలీసులకు, వారి పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసులకు 'ప్రస్తుత కాలంలో పోలీసింగ్ లో సాంకేతిక పరిజ్ఞానం' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న వారు తమ ఆలోచనలను స్పష్టంగా, విశ్లేషణాత్మకంగా, ప్రేరణాత్మకంగా, వ్యక్తపరిచారని పోలీసు పిల్లలు ప్రసం గాలలో మహిళల భద్రత, సామాజిక బాధ్యత, నైతిక విలువల ప్రాముఖ్యతను వివరంగా చర్చించారని తెలిపారు. సైబర్ క్రైమ్ దర్యాప్తులు, డిజిటల్ ఆధారిత నేర నియంత్రణ పద్ధతులపై తమ అభిప్రాయాలను తెలియజేశారన్నారు. పోటీలో పాల్గొన్న అనంతరం గెలుపొందిన ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు ఎస్‌పి చేతుల మీదుగా అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ విజయ రామకృష్ణ, ఆర్ఎస్ఐ అమర్నాథరెడ్డి, ఉపాధ్యా యులు నరసింహారెడ్డి, గిరిధర్, వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, మోహన్‌నాయక్, రెడ్డప్పరెడ్డి, శివభాస్కర్, పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పరీక్షలు రాస్తున్న పోలీసులు

నాదిర్షావలికి 'ది నేషనల్ ఉర్దూ టీచర్ అవార్డు'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయుడు టి.అబ్దుల్‌నాదిర్షావలి 'ది నేషనల్ ఉర్దూ టీచర్ అవార్డు' అందుకున్నారు.ఉర్దూ క్వామీ ఉర్దూ శిక్షక్ కర్మచారి సంఘ్ నేతృత్వంలో విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ఈ పురస్కారానికి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వంద మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. మదనపల్లి నుంచి అబ్దుల్ నాదిర్షావలి ఈ అవార్డుకు ఎంపిక య్యారు. ఆదివారం డిల్లీలోని గాలిబ్ అకాడమీలో జరిగిన 'ది నేషనల్ ఉర్దూ టీచర్ అవార్డు' పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన చౌదరి వాసిల్ అలీ గుర్జర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డుతో పాటు అత్యుత్తమ సేవలు అందించినందుకు బంగారు పతకం, ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడం గర్వంగా ఉందన్నారు. వృత్తిపట్ల అంకితభావం, నిబద్ధతతో పనిచేసినందుకు తనకు ఈ అవార్డు లభించిందన్నారు. తాను ఈ అవార్డు అందుకోవడం వెనుక తోటి ఉపాధ్యాయులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల సహకారం ఎంతో ఉందన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో తనను అన్నివిధాల ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న అబ్దుల్ నాదిర్షావలికి పలువురు ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.భవిష్యత్తులో మరిన్ని అవార్డులు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు.


జాతీయ అవార్డు అందుకుంటున్న నాదిర్షావలి

'వావిలి కొలను' బహుముఖ
ప్రతిభకు నిదర్శనం 'మందర వ్యాఖ్య'


నరసింహారావును సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రవాల్మీకి వావిలికొలను సుబ్బారావు బహుముఖ ప్రతిభకు నిదర్శనం 'మందర వ్యాఖ్య' అని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ రిటైర్డ్ అధికారి డాక్టర్ పోలుదాసు నరసింహారావు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' 148వ సదస్సులో భాగంగా 'ఆంధ్రవాల్మీకి మందర వ్యాఖ్య విశిష్టత' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వావిలికొలను సుబ్బారావు వాసుదాసుగా ప్రసిద్ధులన్నారు. ఆయన వాల్మీకి మహర్షి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని 'ఆంధ్రవాల్మీకి రామాయణం' అనే పేరుతో యథాతథంగా పద్యరూపంలో అంటే 24వేల శ్లోకాలను 24వేల పద్యాలతో అనువదించి ఒంటిమిట్ట కోదండరామునికి అంకితమిచ్చారన్నారు. అందువల్ల ఆయన 'ఆంధ్రవాల్మీకి'గా కొనియాడబడుతున్నారన్నారు. న్యాపతి సుబ్బారావు పంతులు, వావిలాల శివావధానులు ప్రేరణతో వావిలికొలను సుబ్బారావు తాము రచించిన రామాయణానికి 'మందరం' అనే పేరుతో వ్యాఖ్యానాన్ని రచించారన్నారు. రామాయణ విషయంలో కొందరికి ఉన్న సందేహాల గురించి చర్చించారన్నారు. రామాయణకాలం నాటి మనదేశ విభాగం గురించి చెప్పారన్నారు. సీతారామ లక్ష్మణుల సంచార మార్గాలను తెలిపే పటాలను చిత్రించి, శ్రీరాముని దినచర్యను వివరించడం విశేషమన్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి సమన్వయం చేశారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త డాక్టర్ పోలుదాసు నరసింహారావును సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్. వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది కలసి శాలువతో సత్కరించారు. కార్యక్ర మంలో వక్త కుటుంబ సభ్యులు నిర్మల, రేఖ, యజ్ఞప్రియ, విజయకుమార్, రమేశ్, భూపతి రాయల్, రాజారెడ్డి, డాక్టర్ జి.వి.సాయిప్రసాద్, కొత్తపల్లి రామాంజనేయులు, కొండూరు జనార్దన రాజు, శ్యామసుందర్ రెడ్డి, బాలరాజేశ్వర రెడ్డి, శ్రీకాంత్, కుమార్, రఘునాథ రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర రెడ్డి, రమణమూర్తి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలపై
వైసిపి దొంగ నాటకాలు

ప్రజాశక్తి-రాయచోటి

మెడికల్ కాలేజీలను గత వైసిపి ప్రభుత్వం కేవలం పునాది స్థాయిలోనే వదిలేసి నేడు రాష్ట్ర మంతటా దొంగ నాటకాలు ఆడుతున్నారని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని టిడిపిరాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పిపిపి విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం వల్ల నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తే వైసిపి నాయకులకు ఎందుకింత బాధని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు అదనంగా 110 సీట్లు వస్తాయని పేర్కొన్నారు. పేదలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు పిపిపి విధానంతో ఆస్పత్రులు కడితే కేవలం రెండేళ్ల కాలంలోనే ఆసుపత్రులు పూర్తవుతాయని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన విధానంతో ఆసుపత్రులు కడితే 20 ఏళ్లు పడుతుందన్నారు. వైసిపి నాయకులు అభివృద్ధికి సహకరించాలి కానీ ఏదో ప్రభుత్వంపై బురద చల్లాలనే కపట కుయుక్తులు మానుకోవాలని హితవు పలికారు. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక ఒకపక్క పరిశ్రమలు రాష్ట్రానికి స్వచ్ఛందంగా తరలివస్తుంటే కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఎలాగైనా ఏదో ఒకటి బురద చల్లే ప్రయత్నాలు చేయాలని వైసిపి నాయకులు కుట్రలు కుయు క్తులతో నానా తంటాలు పడుతున్నారని పేర్కొన్నారు. వైసిపి నాయకులు ఎన్ని చేసినా ప్రజలు వారిని నమ్మేస్థితిలో లేరన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు సాంబశివరెడ్డి ,శివారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా


నిందితుడు సుదర్శన్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

కల్తీ మద్యం కేసులో మరో ఇద్దరు అరెస్టు
- ఇప్పటికి 17 మందిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ములకలచెరువులో కల్తీ మద్యం తయారు చేస్తున్న డంపును ఈనెల 3న ఎక్సైజ్, స్థానిక పోలీసులు సీజ్ చేసిన సంగతి తెలిసిందే. రూ.1.75 కోట్లకు పైగా విలువ చేసే అక్రమ మద్యం తయారీ డంప్‌తో పాటు పదిమందిని అరెస్టు చేశారు. అనంతరం ముఖ్య సూత్రధారి అద్దెపల్లి జనార్ధన్‌తో పాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో పదిమందిని మదనపల్లె సబ్ జైలుకు తరలించగా ఇటీవలే కోర్టు అనుమతితో రెండు రోజుల కస్టడీకి తీసుకుని విచారించారు. తాజాగా మరో ఇద్దరిని అరెస్టు చేసి మదనపల్లె సబ్ జైలుకు తరలించారు. వీరిలో ఎ15 బాలాజీ, ఎ20 సుదర్శన్ ఉన్నారు. వీరిద్దరూ తండ్రి కుమారులు కావడం విశేషం. తండ్రి బాలాజీ, కుమారుడు సుదర్శన్‌ను బెంగళూరులో అరెస్టు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచి సబ్ జైలుకు తరలించారు. వీరిద్దరూ ఎ1 జనార్ధన్ రావుకు స్పిరిట్ సరఫరా చేసినట్టుగా రుజువు కావడంతో బాలాజీ, సుదర్శన్ లను అరెస్టు చూపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఫేస్ వాష్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని రహదారులపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలలో భాగంగా పోలీసు అధికారులు తమ సిబ్బందితో అర్ధరాత్రి దాటాక లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు, తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపుతున్నారు. లారీలు, కార్లు, వ్యాన్లు, బస్సులు, తదితర వాహనాలు నడిపే సమయంలో తమ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూసుకోవాలని డ్రైవర్లకు పోలీసు అధికారులు సూచించారు

తక్షణమే అన్నమయ్య ప్రాజెక్టును పూర్తి చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట

గతంలో వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టుకు నిధులు కేటాయించి యుద్ధ ప్రతిపాదికన తక్షణమే పూర్తి చేయాలని స్థానిక ఎంపిజె రాజంపేట అధ్యక్షులు పి.మోసిన్ ఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఎంపిజె కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట ప్రాంతంలో వర్షాల వలన వచ్చిన నీరంతా వృధాగా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నమయ్య ప్రాజెక్టు పూర్తి చేసి రాజంపేట ప్రాంతానికి తాగు, సాగునీరు అందించాలని పాలకులను కోరారు. ప్రాజెక్టు నిర్మాణం కొరకు అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు పోరాటం చేయాలని కోరారు. రాజంపేట అన్ని రకాలుగా నష్టపోయిందని, వెనకబడి పోయిందన్నారు. అందుకోసం ప్రజలు చైతన్యవంతులై పోరాటాలు చేసి రాజంపేటను అభివృద్ధి బాటలో నడిపించాలని కోరారు. ఈ సమావేశంలో ముస్లిం సమాజానికి సేవ చేస్తున్న హైదర్ జువెలర్స్ అధినేత షేక్ హైదర్‌సుభాన్‌ను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజంపేట మండల కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ గౌస్ బాషా, ఎస్.జి ఇనాయ తుల్లా, షేక్ నిసార్, ఎస్ఎండి కరీం, సిద్ధిక్ ,ఇలియాస్, షాహిద్, హైదర్ సుభాన్, ముజఫర్ అహ్మద్, మద్యాం గౌస్ పాల్గొన్నారు.


ట్రాన్స్‌కో ఎఇకి అభినందనలు తెలుపుతున్న షేర్‌ఖాన్‌వంక గ్రామస్తులు

ట్రాన్స్‌కో ఎఇ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడ ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి ఎఇ అరుణ్‌కుమార్ సేవలు అభినందనీయమని షేర్‌ఖాన్‌వంక టిడిపి సీనియర్ నాయకులు భరతరాజా, గ్రామస్తులు పేర్కొన్నారు. గత కొన్ని రోజుల క్రితం మండలంలోని గంగాపురం పంచాయతీ షేర్ ఖాన్ వంక వడ్డీపల్లికు చెందిన ఓ రైతు కోళ్ల ఫారం షెడ్డుకు గ్రామానికి సరఫరా అవుతున్న విద్యుత్ ద్వారా కోళ్లఫారానికి విద్యుత్ సరఫరా చేయడం ద్వారా ఇళ్లలో ఉన్న బల్బులు, టివిలు, ఫ్రిజ్‌లు, మోటర్లు విద్యుత్ హెచ్చు, తగ్గుల వల్ల తరచూ కాలిపోతుండటంతో ట్రాన్స్‌కో ఎఇకి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎఇ గ్రామానికి సరఫరా అవుతున్న విద్యుత్ నుంచి కాకుండా వేరే మార్గం ద్వారా కోళ్ల ఫారంకు విద్యుత్‌ను సరఫరా చేసి గ్రామంలోని ఎలక్ట్రానికల్ వస్తువులు కాలిపోకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలు చేస్తున్న అధికారులకు భరత్‌కుమార్ అభినందనలు తెలిపారు.

రేపు చేపల చెరువులకు బహిరంగ వేలం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చేపల ఫలసాయానికై మంగళవారం రెడ్డివారిపల్లి పంచాయతీలోని ఐదు చెరువులకు బహిరంగ వేలంపాటను సర్పంచ్ నూతనకాల్వ రెడ్డమ్మ నరేంద్రరెడ్డి అధ్యక్షతన, ఎంపిడిఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెడ్డివారిపల్లి పంచాయతీలోని 5 చెరువులు ఇటీవల కురిసిన వర్షాలకు నిండడంతో చేపల ఫలసాయానికై బహిరంగ వేలంపాటను రెడ్డివారిపల్లి సచివాలయం వద్ద ఉదయం11 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేలం పాటలో ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా ప్రభుత్వం నిర్ణయించిన డిపాజిట్ రుసుము కట్టి వేలంపాటలో పాల్గొనాలని కోరారు. డిపాజిట్ దారులు గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదని పేర్కొన్నారు. వేలం ముగిసిన వెంటనే హెచ్చుపాట మొత్తాన్ని పాటాదారుడు చెల్లించి తగిన రసీదు పొందాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రానున్న రెండు రోజులు 27, 28 తేదీలలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఎ, విఆర్‌ఒలతో పాటు పంచా యతీరాజ్ శాఖ, పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 27, 28 తేదీలలో విపత్తు నిర్వహణ శాఖ జారీచేసిన ఉత్తర్వులు మేరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతాయని, తుఫాను చెలరేగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలన్నారు.వాగులు, వంకలు, వంతెనలు, మరవలు, గుంతలలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో ప్రజలు ఎవరు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాణపాయ స్థితి ఏర్పడిన వారు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు 08571- 231181 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.. **పుల్లంపేట :** రాష్ట్ర వాతావరణ శాఖ వారి హెచ్చరికలు మేరకు సూచనలు అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాలు అను సరించి రాగల నాలుగు రోజుల్లో అన్నమయ్య జిల్లాకు అతి భారీ వర్ష సూచన ఉన్నందున ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని అలాగే అధికారులు కూడా అందరూ అందుబాటులో ఉండాలని తహశీల్దార్ పుల్లారెడ్డి తెలిపారు. సంబం ధిత గ్రామ రెవెన్యూ అధికారి గ్రామంలో ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించి ఉన్నత అధికారులకు తెలపాలన్నారు.గామ ప్రజలు ఎవరు తుఫాన్ సమయంలో అత్యవసర పరిస్థితిలో తప్ప మిగిలిన ఏ సందర్భంలోనూ ఇంటి నుంచి బయటకు రాకూడదని సూచించారు.

వైసిపిలో పలువురికి పార్టీ పదవులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపిలో రెండు విభాగాలకు నూతన సెక్రటరీలను ఎంపిక చేశారు.ఎ మ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి సూచనల మేరకు జిల్లా సెక్రటరీలగా కంచి కోదండ రామిరెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ సెక్రెటరీగా నాసర్‌ను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం తో పార్టీ అధిష్టానం బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. మాకు అప్పగిం చిన పదవులను సమర్థవంతంగా నిర్వర్తించి పార్టీని బలమైన శక్తిగా తయారు చేయడానికి కృషి చేస్తామని,2029లో పార్టీ గెలుపు కోసం అలుపెరుగని కృషి చేస్తామన్నారు. తమకు పదవులు కేటాయించినందుకు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. **కలికిరి:** వైసిపి జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ గా జెట్టి శామ్యూల్‌ను నియమించినట్లు పార్టీ నుంచి అధికార ప్రకటన వెలుబడింది. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ తనకు పదవి ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేస్తూ నాపై నమ్మకం ఉంచి మాజీ మంత్రి పెది రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. **రామాపురం :** వైసిపి యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా మండలా నికి చెందిన కొవ్వూరి దివ్య కుమార్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్రకార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీ కొండ వాండ్లపల్లికు చెందిన విశ్రాంత అధ్యాపకుడు ఈశ్వర్‌రెడ్డి సోదరుని కుమారుడు కొవ్వూరి దివ్య కుమార్ రెడ్డి కి వైసిపి యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేయడంపై హర్ష చేశారు. కొవ్వూరి ఈశ్వర్‌రెడ్డి సోదరులు మొదటి నుంచి రెడ్డప్పగారి కుటుంబానికి విధే యుడుగా ఉంటు రాజగోపాల్‌రెడ్డికి మండలంలో ముఖ్య అనుచరులుగా ఉండేవారు. ఆయన తరువాత ఆర్ రమేష్‌కుమార్‌రెడ్డి అనుచరులుగా రాజకీ యాల్లో రాణిస్తున్నారు. దివ్య కుమార్ రెడ్డిని జిల్లా ఉపాధ్యక్షులుగా నియమంలో చొరవ చూపిన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. **నిమ్మనపల్లె :** వైసిపి బిసి సెల్ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడిగా నిమ్మనపల్లికి చెందిన రెడ్డి భాస్కర నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం విధేయతగా పనిచేసిన వారికి అధిష్టానం ప్రత్యేక గుర్తింపును కలిగిస్తుందన్నారు. వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథు న్‌రెడ్డి, మదనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తంబళ్లపల్లిలో..


తంబళ్లపల్లి : పదవులు పొందిన వైసిపి నాయకులు

తంబళ్లపల్లి : మండలంలో మాజీ సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో పలువురికి పార్టీ పదవులు దక్కాయి. జిల్లా రైతు విభా గం ప్రధాన కార్యదర్శిగా వై భాస్క ర్‌రెడ్డి (బోరెడ్డివారికోట), రైతు విభాగం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్.కృష్ణారెడ్డి(రెడ్డెంవారిపల్లె),జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా ఎ.రామ్మూర్తి(తంబళ్లపల్లి), పంచా య తీరాజ్ వింగ్ ఉపాధ్యక్షులుగా బి.శివారెడ్డి(ఎర్రగుండ్లపల్లి), పం చాయ తీరాజ్ వింగ్ సెక్రటరీగా కరీ ముల్లా(ఎద్దులవారిపల్లె), జిల్లా వైసి పి సోషల్ మీడియా కార్యదర్శిగా జి.హరీష్(కోసవారిపల్లె)ను నియ మించారు. వారి నియామకానికి కృషిచేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి ఘన విజ యం సాధిం చేందుకు తమ వంతు కృషి చేస్తామని పదవులు పొందిన వారు తెలిపారు.

నీటి ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె


బహుదా ప్రాజెక్టును పరిశీలిస్తున్న డిఎస్‌పి మహేంద్ర

నీటి ప్రమాదాలను నివారించడానికి పోలీసులు పటిష్ట చర్యలను తీసుకుంటున్నట్లు మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని బహుదా ప్రాజెక్టు, బహుదానది, అహోబిలనాయిని చెరువులను మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ సత్యనారాయణ, స్థానిక ఎస్‌ఐ తిప్పేస్వామితో కలిసి పరిశీలించారు. ప్రజలు రాకపోకలు కొనసాగించే దారులలోని నీటి ప్రవాహ ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో పలు చెరువులు, కుంటలతో పాటు బహుదా ప్రాజెక్టు కూడా పూర్తిస్థాయిలో నిండిందన్నారు. బహుదా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 398 ఎంసి ఎఫ్‌టిలు (0.5 టీఎంసి)లు కాగా ప్రస్తుతం పూర్తి స్థాయిలో ప్రాజెక్టు నిండిందన్నారు. ప్రాజెక్టు నుంచి అతి తొందరలో నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు తెలిపారు. బహుదా నదీ పరివాహక ప్రాంతాలలోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుంటే దాటడానికి సాహసాలు చేయవద్దన్నారు. యువత, పిల్లలు, విద్యార్థులు సరదాల కోసం ఈత కొట్టడానికి, చేపలు పట్టడానికి వెళ్ళవద్దని, నీటి ప్రమాదాల బారిన పడవద్దన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫానుగా బలపడిందని భారీ వర్షాలు పడనున్నట్లు తెలిపారు. మొంథా తుఫాను ప్రభావంతో మండలంలో కూడా భారీ వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ సూచించిందని ప్రజలు వర్షం సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటి ప్రమాదాలను నివారించడానికి పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ పంచాయతీ శాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా నీటి ప్రమాదాలపై అవగాహన తెచ్చుకుని అధికారులకు సహకరించాలని, జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో బహుదా ఎఇ శ్రీహరిరెడ్డి, ఎస్‌ఐ తిప్పేస్వామి, ఎస్‌బి పోలీస్ కేశవ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వర్షంతో దెబ్బతిన్న పంటల పరిశీలన


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి - నందలూరు

ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ, రాజంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు జి.శివశంకర్‌తో కలిసి పరిశీలించారు. నందలూరు గ్రామంలో కె.గణపతి సాగు చేసి దెబ్బతిన్న జగిత్యాల, చిట్టి ముత్యాల రకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎఒ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోయే మూడు, నాలుగు రోజులు వ్యవసాయ శాఖ సిబ్బంది వారి హెడ్ క్వార్టర్లలో ఉండి రైతులుకి అందుబాటులో ఉండాలన్నారు. పంట నష్ట వివరాలను పక్కాగా సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు.పంట కోసిన రైతులు వరికుప్పలమీద ఐదు శాతం ఉప్పు ద్రావణంను పిచికారి చేయాలని సూచించారు. కోతకు రెడీగా ఉన్న పంటను వారం రోజులు పాటు వాయిదా వేసుకోవాలని చెప్పారు. ఒకవేళ పంట పొలంలో నీరు నిలబడి ఉంటే ప్రత్యేక కాలువల ద్వారా నీటిని బయటికి పంపాలని తెలిపారు. కిందపడిన వరి కుప్పలను స్టాకింగ్ విధానం ద్వారా కట్టలు కట్టుకోవాలని తెలిపారు. వర్షాలు ఆగిన తర్వాత పంట మీద హెక్సాకానిజోల్ అనే మందులు పిచికారి చేసి వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ఎఒ జి. మల్లికార్జున, వ్యవసాయశాఖ సిబ్బంది శిల్ప, భరత్ కుమార్ ,రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు అంకితభావంతో, నిబద్ధతతో పనిచేసి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలనిఎమ్మెల్యే షాజహా న్‌బాషా పేర్కొన్నారు. డిఎస్‌సి- 2025లో మదనపల్లె నియోజకవర్గం నుంచి దాదాపు 150 మంది ఉపాధ్యాయులుగా ఉత్తీర్ణులు కాగా వారందరిని ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులకు శాలువాతో సత్కరించి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రపతి నుంచి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఐఎఎస్, ఐపిఎస్ లాంటి ఉన్నత స్థానాలకు చేరుకునేవారిని సైతం తయారు చేసే ఉత్కృష్ట స్థానం ఉపాధ్యాయులదేనని చెప్పారు. చదువు మనిషి గమనాన్ని మార్చగలదని, చదువుకు ధనిక, పేద తేడా లేదని గురువు స్థానానికి వెలకట్టలేమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించడమే లక్ష్యం

శ్రీ శరణ్య గ్రానైట్స్ అండ్ టైల్స్ యజమాని కె.ఎస్.నరసింహ



ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టైల్స్ రంగంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం వల్లే జిల్లాలో వినియోగదారుల అభిమానాన్ని పొందగలుగుతున్నామని శ్రీ శరణ్య టైల్స్ అండ్ గ్రానైట్స్ యజమాని కె.ఎస్ నరసింహ పేర్కొన్నారు. ఆదివారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో గృహ నిర్మాణాలలో టైల్స్ ,గ్రానైట్స్ కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ధనికులే కాక పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని సరసమైన ధరలతో అత్యంత నాణ్యతా ప్రమాణాలతో కూడుకున్న కంపెనీలకు చెందిన టైల్స్ గ్రానైట్లను మాత్రమే తాము విక్రయిస్తూ అనతి కాలంలోనే ప్రజల విశ్వసనీయతను పొందగలిగామని తెలిపారు. జాతీయ రహదారిలోని ఎన్టీఆర్ కూడలికి సమీపంలో 2011లో శరణ్య గ్రానైట్, టైల్స్ ప్రారంభించడం జరిగిందని చెప్పారు. అప్పటి నుంచి నేటి వరకు నాణ్యతలో రాజీ పడిందే లేదని అన్నారు. తమ వద్ద జాన్సన్, కజారియా, సన్ హట్, ఓరియంట్ బెల్, అమైరా కంపెనీలకు సంబందించిన ప్రపంచంలోనే ప్రసిద్ధి గాంచిన బహుళ జాతి కంపెనీల టైల్స్, గ్రానైట్స్ తమ వద్ద లభిస్తాయని తెలిపారు. అతి త్వరలోనే జాతీయ రహదారిలోని మునిబాలకృష్ణ ఆసుపత్రికి సమీపంలో రెండవ బ్రాంచి ప్రారంభిం చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగప రుచుకోవాలని కోరారు.

2011 ముందు ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి



మాట్లాడుతున్న సూర్యుడు నాయక్

ప్రజాశక్తి-పుల్లంపేట

2011 ముందు ఉపాధ్యాయ సర్వీసులో చేరిన వారికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయులు కోరారు. ప్రోగ్రెస్సివ్ రికగ్నైస్డ్ టీచర్స్ యూనియన్ రాజంపేట డివిజనల్ స్థాయి సమావేశం జరిగినట్లు ఆ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర్యుడు నాయక్, శీపాల ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు మిట్ట క్రిష్ణయ్య హాజరై వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011 ముందు ఉపాధ్యాయ సర్వీస్‌లో చేరినవారికి టెట్ నుంచి మినహాయింపు లభించేటట్లుగా కృషి చేస్తామని హామీనిచ్చారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా అధ్యక్షులు రామచంద్రరాజు, ఆదాల నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు పూల నరసింహమూర్తి, రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, ఆర్గనైసింగ్ సెక్రటరీ శ్రీనివాసులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గార్గేయనదిలో బైక్‌తో కొట్టుకుపోయిన యువకుడు

-కాపాడిన రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక సిబ్బంది


గార్గేయనది నుంచి యువకుడిని కాపాడుతున్న రెస్క్యూ టీమ్


సురక్షితంగా ఒడ్డుకు చేరిన కార్తీక్

ప్రజాశక్తి-పీలేరు

గార్గేయనదిలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంతో సహా కొట్టుకుపోయాడు. అదృష్టవశాత్తు కొంత దూరం నీటిలో కొట్టుకు పోయాక చెట్టుకొమ్మ సాయంతో ఓ బండరాయిపైకెక్కి తనను కాపాడమంటూ ఫోన్ ద్వారా బంధువులకు సమాచారం అందించిన సంఘటన పీలేరు మండలంలో చోటు చేసుకుంది. ఆదివారం తహశీల్దారు శివకుమార్ మీడియాకు తెలిపిన సమాచారం మేరకు..మండలంలోని కాకులారంపల్లి పంచాయితీ, కోళ్లఫారంకు చెందిన గుండ్లూరు రవికుమార్, లీలావతిల కుమారుడు గుండ్లూరు కార్తీక్ బాలంవారిపల్లి పంచాయతీ, నాలేవాండ్లపల్లిలోని తన అమ్మమ్మ ఇంటికి తన తల్లితో కలసి ద్విచక్ర వాహనంలో వచ్చాడు. శనివారం గార్గేయనదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండడంతో ద్విచక్ర వాహనంలో నది దాటి నాలేవాళ్ళపల్లికి చేరుకున్నారు. ఆదివారం ఆ యువకుడు తిరిగి తన ఇంటికి వెళ్లే క్రమంలో నదిలో ప్రవాహ వేగాన్ని అంచనా వేయకుండా ద్విచక్ర వాహనంలో గార్గేయనది దాటుతూ వాహనంతో సహా నీటిలో గల్లంతయ్యాడు. అలా కొంత దూరం నీటిలోనే కొట్టుకుపోతూ ఓ చెట్టుకొమ్మను పట్టుకుని బండపైకి చేరుకున్నాడు. తన పరిస్థితిని చరవాణి ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అప్రమత్తమైన పీలేరు తహశీల్దారు శివకుమార్, సిఐ యుగంధర్, ఫైర్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి సిబ్బందితో కలిసి హుటాహుటన సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అది కష్టం పైన రోప్ సాయంతో యువకుడిని కాపాడారు. ఈ సందర్భంగా తహశీల్దార్, సిఐ, అగ్నిమాపక అధికారి మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న కారణంగా మండల పరిధిలో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్తీన్‌ను సురక్షితంగా కాపాడడంతో అతని కుటుంబ సభ్యులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సహాయచర్యల్లో అగ్ని మాపక సిబ్బంది చలపతి, అశోక్, జాకీర్, షఫీ, రాజేంద్రబాబు, ఇమ్రాన్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలోకి మాజీ ఎంపిటిసి, సర్పంచ్

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోరాన్ చెరువు పంచాయితీ దాసరి వాండ్ల పల్లికి చెందిన మాజీ యంపిటిసి దాసరి చిన్నరెడ్డి మాజీ సర్పంచ్ దాసరినాగిరెడ్డి మంగళవారం టిడిపిలో చేరనున్నారు. వారితోపాటు బిసి,ఎస్‌సిలు, మరి కొందరు వారి అనుచరుల సారథ్యంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరనున్నారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే టిడిపిలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సమర్థవంగా పని చేస్తోందన్నారు. ఇప్పటికే గోరాన్ చెరువు గ్రామంలో మాజీ ఎంపిటిసి రెడ్డి ప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు టిడిపిలో ఉన్నారు. స్థానిక సంస్థలు ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో దాసరి వాండ్లపల్లిలో వున్న మాజీ ఎంపిటిసి, మాజీ సర్పంచ్ అన్నదమ్ములు ఇద్దరూ టిడిపిలో చేరడంతో గోరాన్‌చెరువులో మిగతా పార్టీలలో అలజడి మొదలైంది.


బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న వైసిపి నాయకులు

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న ఆటో డ్రైవర్ షమీ కుమారుడు మహమ్మద్ అయాన్(7) ఇటీవల ప్రమాదవశాత్తు గోడపైనుండి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు.ఈ ప్రమాదంలో విద్యార్థి కిడ్నీలకు ముప్పు ఏర్పడింది. దీంతో చిన్నారికి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించారు.శస్త్ర చికిత్సకు రూ.పది లక్షల వరకు ఖర్చు అవుతున్న నేపథ్యంలో చిన్నారి తల్లిదండ్రులు దాతలను ఆశ్రయించారు. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దృష్టికి వెళ్లగా చిన్నారి శస్త్ర చికిత్స కోసం రూ.లక్ష బి.కొత్తకోట వైసిపి నాయకుల చేతుల మీదుగా ఆ నగ దును బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాలుడు త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలనే ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపి పి ఖలీల్‌అహ్మద్, మాజీ వైస్ సర్పంచ్ మాలిక్, నాయకులు జాఫర్ బాషా, టి.షాహిన్‌ఖాన్, సి.ఆర్.చిన్నికృష్ణ, మరియు ఎస్ఎస్ ఫయాజ్,కో-ఆప్షన్ మెంబర్ నాసర్, మాజీ సచివాలయం కన్వీనర్ చాంద్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-రాజంపేట

అన్నమయ్య ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా జ్యోతి సాయి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజంపేట పట్టణంలోని పద్మ ప్రియ కల్యాణ మండపంలో ఆదివారం అన్నమయ్య ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు, మండల స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉమ్మడి కడప జిల్లా నాయకులు మాట్లాడుతూ చిన్న వయస్సులో నూతన అధ్యక్షుడిగా జ్యోతి సాయికుమార్ ఎన్నిక కావడం చాలా సంతోషకరమైన విషయమని అభినందించారు. ఏదైనా మార్పు రావాలంటే యువకులు ముందుకు వచ్చి ఐకమత్యంగా కలిసి పని చేస్తేనే విజయం చేకూరుతుందన్నారు. అప్పుడే సమాజంలో మార్పు మొదలవుతుందని ఆకాంక్షించారు. ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నూతన అధ్యక్షుడు జ్యోతి సాయి కుమార్, ఉప అధ్యక్షులు నంద్యాల చిన్న, కోశాధికారి పుత్తనవారి పల్లె సుబ్రమణ్యం, కార్యదర్శిగా సుబ్బు, సంయుక్త కార్యదర్శి గుండ్లూరు సురేంద్ర, సభ్యులు సునీల్, రమేష్, నరేంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. ఫోటోగ్రఫీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని, ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం యూనియన్ పెద్దలను కమిటీ సభ్యులు శాలువాలు, పూల దండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ పెద్దలు శ్రీనివాసుల రాజు, మయూరి శ్రీను, నాగేంద్ర, నిసార్, రఘు వర్మ, దుర్గ రాయల్, రమణ, ల్యాబ్ రమణ జిల్లా వ్యాప్తంగా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి-రామాపురం

టిడిపి కార్యకర్త వెంకటస్వామి కుటుంబానికి పార్టీ అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచపల్లిపంచాయతీ వడ్డేపల్లికి చెందిన టిడిపి కార్యకర్త కుంచపు వెంకటస్వామి ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా మృతి చెందడంతో విషయం తెలుసుకున్న లక్ష్మీ ప్రసాద్ రెడ్డి వెంకటస్వామి స్వగృహానికి వచ్చి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ పార్టీ ఎల్లవేళలా కుటుంబానికి అండగా ఉంటూ అన్ని విధాల ఆదుకుంటామని భరోసానిచ్చారు. కార్యకర్తలకు అండగా ఉండే పార్టీ టిడిపి మాత్రమేనని అన్నారు. లక్ష్మీప్రసాద్‌రెడ్డి వెంట చెన్న కృష్ణారెడ్డి, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా కంచాలమ్మ గండిచెరువు అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణ శివార్లలోని ఎగువ అబ్బవరం వద్ద ఉన్న కంచాలమ్మ గండి చెరువులో సాగునీరు అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో అభివృద్ధి, మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయని అర్చన విద్యాసంస్థల అధినేత డాక్టర్ పాపిరెడ్డి మదనమోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర రవాణా, క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఇరిగేషన్ విభాగం డిఇ చెంగల్‌రాయుడు, ఎఇ బాబు పర్యవేక్షణలో చెరువుకట్ట మరమ్మతు, మొరవ పనులు, దెబ్బతిన్న కాలువలు, తూములు పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయన్నారు. గత నాలుగైదు రోజులుగా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ పనుల పురోగతిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి జీవనాడిగా నిలిచిన ఈ చెరువు నుంచి ప్రవహించే ఆరు ప్రధాన కాలువల క్రింద సుమారు 450 ఎకరాల ఆయకట్టు విస్తరించి ఉందన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెరువును కేవలం నీటి నిల్వ కేంద్రంగా కాకుండా, పర్యావరణ పరిరక్షణతో కూడిన సుందర ప్రదేశంగా తీర్చిదిద్దే దిశగా కూడా పనులు సాగుతున్నాయన్నారు.గతంలో అధిక వర్షాలు రావడం వల్ల చెరువు కట్ట బలహీనపడగా, మొరవ పగుళ్ల కారణంగా నీరు నిల్వ కాలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఆక్రమించబడిన కాలువలను సైతం పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకతని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి రైతుల ప్రయోజనం కోసం ఈ పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు.రాయచోటి పట్టణంలో కొత్తపేట, రామాపురం వరకు అక్రమణ తొలగించడానికి కంకణం కట్టుకున్నా మని, ఆక్రమణదారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్య క్రమంలో ఆయుకట్టుదారుల కమిటీ సభ్యులు రామకృష్ణారెడ్డి,వాసుదేవ రెడ్డి,వెంకట్రా మిరెడ్డి,రామకృష్ణ,రామాంజులులు సుబ్బారెడ్డి, ఓబుల్ రెడ్డి, సాధురాజా రెడ్డి, గంగిరెడ్డి, వెంకట రమణ, నాగయ్య, రాయచోటి రమణ, పాల్గొన్నారు.


మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

క్రైం కార్నర్

ఆగివున్న ట్రాక్టర్ ట్రాలీని ఢీ కొట్టిన బైక్

-యువకుడి మృతి

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని రాయచోటి-చిన్నమండెం ప్రధాన జాతీయ రహదారి పైన కస్తూర్బా హైస్కూల్ సమీపంలో ఆదివారం రోడ్డు పక్కన ఆపి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని బైక్ ఢీ కొనడంతో యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు..గుర్రంకొండ కు చెందిన అజయ్(20) గుర్రంకొండ నుంచి పొలతలకి వెళుతుండగా మార్గమధ్యంలో అతివేగంతో రోడ్డు పక్కన ఆపి ఉన్నటువంటి ట్రాలీని ఢీ కొనడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.